ఏకాంక నాటిక:

జూదం కాని జూదం

శ్రీ పుట్రేవు సత్యనారాయణమూర్తి

[స్థలం:— రంగారావు ఇల్లు. వీధి గదిలో రంగారావు చేతులువున్న పడకకుర్చీలో కూర్చుని ఎదుట ఒక బల్ల వేసుకుని, దానిమీద ఒక పజిలు కాగితం పెట్టుకుని చేతితో కలం పట్టుకుని పజిలు కాగితంవైపు చూస్తూ ఆలోచిస్తూ వుంటాడు. వాని వయస్సు 30 సంవత్సరాలు. ప్రక్కను నేలమీద రెండు పెద్ద డిక్షనరీలు పడివుంటాయి. వీధి గదిలోనుండి లోపలి గదిలోనికి దారి ఉంటుంది. ఆ గుమ్మందగ్గర రంగారావు భార్య కాంతమ్మ నిలబడి వుంటుంది. వయస్సు 24 సంవత్సరాలు.]

కాలం:— ఉదయం 8 గంటలు.

కాంతమ్మ: ఏమండీ! కుర్రాడికి రెండు లాగుగుడ్డలుకుట్టించి పడెయ్యండీ అని ఎన్నిమార్లు చెప్పినా వినిపించుకోరేమండీ.

రంగారావు: (వినిపించుకోకుండా పజిలు కాగితం వంక తలకాయి వంచుకుని చూస్తూవుంటాడు.)

కాం: సంసారం అంటే యింత నిర్లక్ష్యం అయిపోతే యింకెలాగ చావడం! రామిగాడు బడికి వెళ్ళనుగాక వెళ్లనని భీష్మించుకు కూర్చున్నాడు.

రం: (బుర్రవంచుకునే ఆలోచిస్తూ వుంటాడు.)

కాం: మిమ్మల్నేనండి! (చికాకుగా) మాట్లాడేవాళ్లు మనుషులనుకున్నారో, మానులనుకున్నారో! అడిగిందానికి అతీ లేదు గతీలేదు. కుర్రవెధవలు చూస్తే మధ్య నన్ను కాల్చుకు తింటారు. ఆ యేడిచే ఏడుపేదో యిక్కడికొచ్చి ఏడవరాదూ!

రం: (తలకాయ మీదికెత్తి) అబ్బ! ఎప్పుడు చూసినా యిదే న్యూసెన్సు! నీ యేడుపు చాలక, వాళ్ళనికూడా వచ్చి ఏడవమంటున్నావూ? 'శ్రేయాంసి బహు విఘ్నాని' అన్నట్టు, నేను ఏ మంచికార్యం తలపెట్టినా, సమయానికల్లా నువ్వు శకున పక్షిలాగ వచ్చి సోది వెళ్లబోస్తుంటావు. వేరే ఏ అడవిలోకేనాపోతే బాగుండుననిపిస్తోంది.

కాం: నిజమే. అనిపించదామరి! నేను ఈ నోరు విప్పితేనే మీకంతా గోలగా వుంటుంది. ఏంజేద్దాం మరి! హోటల్లో భోంచేసి మఠంలో నిద్రిస్తూవుంటే హాయిగా వుంటుంది మీకు. పెళ్ళాం పిల్లలూ అంటే మీకు పెద్ద నరకంలాగ వుంది. అయితే మట్టుకు యిప్పుడు యీ పెళ్ళాం, పిల్లలూ ఎక్కడికి పోతారు? కాళ్ళకు సంకెళ్ళయి తగులుకు కూర్చున్నారు. పాపం మీకు స్వేచ్ఛలేకుండా పోతోంది!

రం: అనవసరపు పురాణాలన్నీ యిప్పుడిక్కడ ఏకరు పెట్టక, అసలు విషయం ఏమిటో ముక్తసరిగా మూడుమాటల్లో చెప్పు బ్రతుకుతాను.

కాం: అబ్బ! నానోటి మాట అంటే ఎంత చేదయిపోయింది!

రం: అదేనా, నువ్వు చెప్పదల్చుకున్నది? ఇంకా ఏమైనా వుందా?

కాం: ఇంతసేపాయీ చెబుతున్నదేమిటి? కుర్రవెధకి రెండు లాగులు కుట్టించమని మొర్రపెడుతూంటేను. వాడికి బొత్తిగా లాగు గుడ్డలు చిరిగిపోయేయి. ఉన్న రెండు లాగులూ వెనకప్రక్క పూర్తిగా పీకిపోయేయి. (వెనకకు తిరిగి) రామిగా, యిలా రా!

[రామంగాడు పరుగెత్తుకుని వస్తాడు 8 ఏళ్లు వయస్సు].

కాం: ఏదీ, నీ లాగు నాన్నగారికి చూపించు. వెధవ్వి! నన్ను కాల్చుకు తినకపోతే నాన్నగారితో చెప్పకూడదూ లాగులు కుట్టించాలనీ.

రామం: కొత్తలాగులు కుట్టిస్తేనేగాని, నేను అసలు బడికే వెళ్ళను. బళ్లో కుర్రాళ్ళంతా నా చింకిలాగు చూసి 'పోస్టాసుఫీసా,' పోస్టాఫీసు; ఉత్తరాలు పడెయ్యండి' అంటూ కాగితం ముక్కలూ, గులకరాళ్లూ తెచ్చి వెనకనుంచి లాగులో పడవేస్తున్నారు. అంతా, నన్నూ, నాలాగునీ చూసి వేళాకోళం చేస్తున్నారు నాన్నా! ఈవాళ ఎలాగైనా కొత్తలాగు కుట్టించకపోతే, నేను బడికి వెళ్ళేది లేదు నాన్నా.

రం: (కొంచం నవ్వుకుని) ఓహో! అయితే పోస్టాఫీసు మన యింట్లోనే వుందన్నమాట. అయితే వుండు నావికూడా రెండు ఉత్తరాలు ఉన్నాయి పడేస్తాను.

రామం: ఏమిటి నాన్నా! నీ వేళాకోళాలూ నువ్వూనూ! లాగులు కుట్టించమని ఎన్నిమార్లు చెప్పినా కుట్టించవుగాని, పరాశికాలు ఆడుతావు. నేనసలు బడికే వెళ్ళను చూసుకో.

కాం: బాగుందండీ! మీ సంగతి! బళ్లో గుంటలు ఉడికిస్తున్నారనే ఆ వెధవ ఏడుస్తుంటే మీరు వాడిని మరింత ఏడిపించడానికి చూస్తున్నారు.

రం: కాకపోతే మరేమిటే నీ వేషం! లాగు చిరుగు పట్టే సరికల్లా కొత్తలాగులు ఎక్కడినుండి ఊడిపడతాయనుకున్నావు? ఇంతసేపు కొడుకు తరపున వకాల్తా చెయ్యకపోతే, సూదీ దారం

పట్టుకుని ఆ చిరుగు కాస్తా కుట్టేసి పెట్టలేకపోయినావ్? అందుకు వొళ్లువొంగదు మళ్ళీని, పంతులుగారికి. అయిందానికీ కాందానికీ కొల్చుకు తింటూవుంటే ఎంతకని చస్తాను. అనీ సరికల్లా డబ్బు ఎక్కడినుండి ఊడిపడితుంది? పెరట్లో చెట్టుగాని ఉందను కున్నారా? కావలసినప్పుడల్లా దులుపుతూ వుండడానికి?

కాం: ఇప్పటి కప్పుడే అరడజను మార్లు కుట్టడం, పీకి పోవడం జరిగింది. ఎప్పుడు కుట్టించిన గుడ్డలు? ఎన్నాళ్ళని ఉంటాయి? ఈ లాగులు కుట్టించి రెండేళ్ళు కావస్తోంది. మరీ ఈ మధ్య అదేమిటోగాని, మరీ పిసండం పడుతున్నారు. జీతం హెచ్చైన కొద్దీ మీకు పిసినారి గొట్టుతనం మరీ లావైపోతోంది. ఇంట్లోకి ఏది కొనమన్నా, డబ్బు లేదంటూ వుంటారు. లేకపోతే, తెచ్చిన జీతమంతా ఏమైపోతూన్నట్టు? కూతురు పెళ్ళికిగాని కూడబెడుతున్నా రేమిటి?

రం: ఔనౌను. ఇంట్లోకి ఏం కొంటున్నాను గనక? ఏమీ కొనకుండానే కాలక్షేపం చేసుకొస్తున్నావు పాపం! యిల్లాలువి ఎలాగైతేనేం. కాఫీగింజలు—నువ్వు పెరట్లో చెట్లునాటి, రోజూ నీళ్లుపోసి పండిస్తున్నావాయను. పంచదార గాలికి కొట్టుకొచ్చి పడుతున్నాదాయను. రైతులు ధాన్యాలు బళ్ళతో తెచ్చి అంబారాలు కొలుస్తున్నారాయను. ఇంక ఎంతొచ్చీ నా నెల జీతం అంతా కిల్లీలకూ, సిగరెట్లకూ, సినీమాలకీ అయిపోతోంది. ఇలాంటి దుబారా మనిషి దొరికేడు నీకు పాపం! ఏం చేద్దాం? నువ్వుగనక యిన్ని బాధలు భరించుకుంటూ వస్తున్నావు.

కాం: ఇందాకా, నేను పురాణం విప్పుతున్నానన్నారుగాని, యిప్పుడు మీరు భారతం అంతా ఏకరుపెడుతున్నారు. పిల్లడికి ఒక లాగుగుడ్డ కుట్టించమని అడిగితే అక్కరమాలిన కబుర్లన్నీ ఎందుకు చెప్పండీ ఆలాపించటం?

రం: మాట్లాడకపోతే మా చికాకు! అడిగిందానికి సమాధానం చెబితే ఆగ్రహం. ఇక నీతో ఎలాగ వేగడమో తెలీకుండావుంది.

కాం: ఏంజేస్తారు పాపం! నాలాంటి తెలివితక్కువ మొద్దుని కట్టుకున్నాక అనుభవించక తప్పుతుందా ఏమిటి?

రం: సరేలే, యీ రోకళ్ళపాట కట్టిపెట్టుగానీ, ఈవాళ కాఫీ ఎందుచేతా, అదోలాగ వుంది? చల్లగా చల్లారిపోవడంచేత కబోసు. అసలు ఈవాళ కాఫీ త్రాగినట్లే లేదు. కొంచం వేడి కాఫీ ఒక అరకప్పు కలుపుకు రద్దూ.

కాం: పంచదార లేందే ఎలాగ కలపడం?

రం: అదిగో! ఏదైనా అడగభయం. అదిలేదు, ఇదిలేదు, ఆఖరికి యింట్లో ఏమీలేదని ప్రారంభిస్తావు. పంచదార మొన్ననే కదూ, వీశడు తెచ్చిపడేసేను? అప్పుడే ఎలాగ అయిపోయిందీ?

కాం: ఎలాగైపోయిందా! నేను బొక్కేసేను. నాకు మరి అట్టే కోపం తెప్పించకండి, నాకు అసలే మాటలు తిన్నగారావు.

రం: నీకు నిజంగా మనిషికుండవలసిన కోపం అంతా వుందే.

కాం: లేకపోతే ఏమిటి మీ మాటలూ మీరూనూ? క్రిందటి పున్నానికి వీసెడు పంచదార తెచ్చేరు ఎలాగైతేనేం. నిన్న అమావాస్యవెళ్ళి యీవాళ పాడ్యమి వచ్చింది. ఎన్నాళ్లయిందో లెక్కకట్టండి. మీకు మొన్న తెచ్చినట్టుగా అనిపిస్తోంది. మూడు రోజులబట్టి యింట్లో పంచదార లేదు.

రం: అంటే తెగబారెడు కోపంగానీ, మూడురోజులబట్టీ పంచదార అయిపోతే యింతవరకూ ఎందుకు చెప్పేవుకావే?

కాం : చెప్పకపోవడమేమిటి? ఈ మూడు రోజుల్లోనూ ముప్పై పుంజీల మార్లైనా చెప్పివుంటాను. మీరు వినిపించుకోక పోతే నేనేం చస్తానేమిటి?

రం: అంత పనిమాత్రం చెయ్యకు వారం వర్జం, మంచీ చెడ్డా చూసుకోకుండా. నేనేదో పరధ్యాన్నంగా వుండి వినకపోతే మరో మారు చెప్పకూడదూ? ఇంతట్లోకే నీ ఘరానాకి లోటు వచ్చేస్తుంది కాబోసు. అయితే మరి ఈవాళ కాఫీ ఎలాగ పెట్టేవు ?

కాం: ఎలాగ పెట్టేను? బెల్లంవేసి పెట్టేను.

రం: అలాగ చెప్పు! ఏమిట్రా, కాఫీ యిలాగ వికారంగా వుందీ అని అనుకుంటూనే వున్నాను. అయితే, నా ఖర్మంగాలి, ఇంత బతుకూ బతికి యింటి వెనకాల చచ్చేడన్నట్టు యింత డబ్బూ తెస్తూ, యింత ఉద్యోగంచేస్తూ, బెల్లపునీళ్ళు తాగవలసి వచ్చిందన్నమాట!

కాం: మీ కాఫీలో ఏం బెల్లం వెయ్యలేదు.

రం : మరి ?

కాం: కొంచం పంచదార వేరే, అట్టేబెట్టి, మీ మట్టుకు కాఫీలో వేసి, నేనూ పిల్లలూ బెల్లం వేసుకు తాగుతున్నాం.

రంగా: మీరుమాత్రం బెల్లం ఎందుకు వేసుకోవాలీ అంటాను? పంచదార దొరకనిరోజులు గనకనా? ఏదో తప్పనిసరి అనుకోడానికి?

కాం: దొరికే రోజులైతేనేం, దొరకని రోజులైతేనేం, మీరు తెచ్చి పడెయ్యక పోయేక?

రంగా: నిజం చెప్పాలంటే అది నా లోటుకాదు. మగ వాళ్లకి ఏవో అనేక పనితొందర్లు ఉంటూవుంటాయి. అస్తమానూ పంచదార సంగతే జ్ఞాపకం ఉంటుందా? ఏదో నేను పరధ్యాన్నంగా వున్నప్పుడు ఏ మూలనుంచో నువ్వు 'పంచదార అయిపోయిందని' నోట్లోనోట్లో గుసగుసలాడుకుని, మనపని అయిపోయిందని ఊరుకోవడమున్నూ, పదిమార్లు చెప్పినా తెచ్చేరు కారని పై వాళ్లమీద అక్షింతలు జల్లడమున్నూ. ఇదే ఆడవాళ్ళ చమత్కారం అంటే. అయితే రాగా పోగా ప్రస్తుతం కాఫీ నీళ్ల మాట ఏమిటంటావు? ఇప్పుడు ఘాటుగా ఆలోచించవలసిన మేటరు ఎంతైనా వుంది. హాటుగా కాఫీనీళ్ళు కడుపులో పడితేనే గాని ఆలోచనలు తట్టవు. పంచదార అంత బొత్తిగా అయిపోయిందిటే ?

కాం: ఏదో, డబ్బా దులిపి చూస్తానుండండి. ఇప్పటిమట్టుకు సరిపోతుందేమో.

రం: మెనీ మెనీ థ్యాంక్సు. ఇల్లాలంటే అలాగ వుండాలి. నిజంగా, నీ చేతిమహాత్యం ఏమిటోగాని, నువ్వు ముట్టుకునీ సరి

కల్లా కాఫీ డబ్బాలుకూడా అక్షయం ఔతూవుంటాయి. ఇప్పటికి కూడా సరిపోయినంత వుండగానే, నాలుగు రోజులబట్టి అయిపోయింది అయిపోయిందని గోల పెడుతున్నావన్నమాట. దీనినిబట్టి చూస్తే, ఇంకా నాలుగైదు రోజులవరకూ కథ నడిచిపోవచ్చునన్నమాట. ఇప్పుడే బజారుకుపోవాలో ఏమిటో అని బెంగపెట్టుకున్నాను. ఐనా నువ్వు ముందుగుండా చెప్పడం మంచిదేలే. ఇంగ్లీషులో 'ఫోర్ వారన్డ్ ఈజ్ ఫోర్ ఆరమ్డు. (*Fore-warned is forearmed*) అని సామెత వుందిలే. దేనికైనా మూడురోజులు ముందుగానే మేలుకోవడం చాలా మంచిది.

కాం: మీ రెంతసేపూ ఎగొస్తే ఎగువుమాట, దిగొస్తే దిగువమాటా ఆడుతూ వుంటారు. మీకు నచ్చచెప్పి మిమ్మల్ని నమ్మించడం బ్రహ్మతరంగాదు. ఆ డబ్బా ఏదో తెచ్చి మీ ముందే దులిపేస్తా నుండండి. ఆ అనుమానం కాస్తా తీరిపోతుంది.

రంగా: ఓస్సి! ఏదో సరదాకి అలాగ అన్నానుగాని, నీమాటేమిటి, నేను నమ్మకపోవడమేమిటి? సరేగాని, ఇదిగో చూడు, రెండునిముషాల్లో ఒక్క అరకప్పు వేడి కాఫీ తాగిస్తివా, నీ కెంతైనా పుణ్యం వుంటుంది. ఇక్కడున్నట్టుగా రావాలి సుమీ.

కాం: మరి రామిగాడికి యీవాళైనా రెండు లాగులు కుట్టిస్తేగాని వీల్లేదు సుమండీ!

రామా: నాకు యిప్పుడే లాగులు కుట్టించు నాన్నా. రా, బజారుకి రా. (చెయ్యిపట్టుకు లాగుతాడు.)

[కాంతమ్మ యింట్లోకి వెళుతుంది]

రం: తల్చినప్పుడే తాతకి పెళ్ళి అన్నట్టుందిరా అబ్బీ, నీ సంగతి. రేపో ఎల్లుండో కుట్టిస్తానులే. ఈవాళకి బళ్లోకి పో.

రామా: (కోపంతో) (తను తొడుక్కున్న లాగు వెనకప్రక్కనున్న చిరుగు తండ్రికి చూపిస్తూ) ఈ చింకిలాగుతో బడికి ఎలా వెళ్లమన్నావు నాన్నా? అంతా నవ్వుతుంటేనూ?

రంగా: వెనకప్రక్కని చిరుగువుంటే నీకేం పోయిందిరా? నువ్వు ముందు వెళ్ళిపోతూవుంటే వెనక వాళ్ళుగదా నవ్వుకుంటారు. నువ్వు వెనక్కి తిరిగి చూడేవద్దు. ఇంక వాళ్లు నిన్నేం చేస్తారు?

రామా: బళ్లో కుర్రాళ్ళంతా ఉడికిస్తారు నాన్నా.

రంగా: నువ్వు ఎందుకు ఉడుక్కోవాలీ?

రామా: చింకి లాగు తొడుక్కుంటే సిగ్గయ్యదుట! నాన్నా! మరీ చెబుతావు!

రంగా: (నవ్వుకుని) సరేలే, సాయంత్రం నిన్ను బజారుకి తీసుకువెళ్లి కుట్టిస్తానులే. ఈపూటకి ఎలాగో వెళ్ళు:

రామా: తప్పకుండా కుట్టించాలిగదా మరి. ఎప్పుడూ, కుట్టిస్తాను కుట్టిస్తాను అంటావుగాని, ఎప్పుడూ కుట్టించవు.

[అనుకుంటూ లోపలికి వెళ్ళిపోతాడు]

[పన్నెండేళ్ల కూతురు సావిత్రి ప్రవేశిస్తుంది]

సావిత్రి: ఈవాళ జీతం కట్టకపోతే పేరుతీసేస్తారుట నాన్నా.

రం: ఈవాళ ఎన్నో తారీకమ్మా!

సా: ముప్పయ్యో తారీకు నాన్నా?

రం: అయితే రేపు ముప్పైఒకటన్నమాట. రేపు సాయంత్రం వరకూ పేరు తీసీడానికి వీల్లేదే? ఎవళ్ళా నీతో చెప్పినవాళ్లు.

సా: ఈనెల ముప్ఫైరోజులే నాన్నా. రేపు ఫష్టుతారీకు.

రం: ఓహో! అలాగా! అయితే ఇన్నాళ్ళబట్టీ ఏంచేస్తున్నావ్.

సా: పదిహేనో తారీకున అడిగితే, ఇప్పుడు డబ్బులేదు, ఫైనుతో కట్టవచ్చునులే అని చెప్పేవు.

రం: అప్పుడు అలాగ చెప్పేననుకో, అందుకని, ఇప్పటిదాకా చల్లగా ఊరుకుని, యిప్పటికిప్పుడు నా నెత్తిమీద కూర్చుని యిస్తావా చస్తావా అంటే ఎక్కడినుంచి తెస్తాను? ఇన్నాళ్ళబట్టీ ఎందుకు జ్ఞాపకంజేసేవుగావు?

సా: అస్తమానమూ అడిగితే మీకుకోపం వస్తుందనిఅడగలేదు

రం: సరేలే. పేరు తీసేస్తే మరేం ఫరవాలేదు. రేపో ఎల్లుండో జీతం అందేక కట్టవచ్చునులే. వచ్చే నెలదగ్గిరనుంచి, నాకు జీతం అందగానే, నీ స్కూలుజీతం ఏదో అడిగి పుచ్చుకుని నీ దగ్గిరే దాచుకో. మధ్యమధ్యను అడిగితే నాదగ్గిర డబ్బుండదు.

సావిత్రి: క్రిందటినెల అలాగ చెప్పే ఐదురూపాయలు యిచ్చేరు. మళ్ళీ పదో తారీకుని ఏదో పజిలుకి కట్టాలి, అని ఆ రూపాయిలు పుచ్చేసుకున్నారు. నెలాఖరుని అమ్మ ఎవళ్లదగ్గిరో అప్పుతెచ్చి యిస్తే కట్టేను.

రం: సరే, అయిపోయిన సంగతంతా యిప్పుడెందుకులే వెళ్లు.

[సావిత్రి మొఖం ముడుచుకుని వెళ్లిపోతుంది.]

(కాంతమ్మ ఓ చేత్తో కాఫీ గళాసూ, ఓ చేత్తో పంచదార డబ్బా పట్టుకుని ప్రవేశిస్తుంది. కాఫీ గ్లాసు భర్తముందు పెట్టి నేలమీద చతికిలబడుతుంది. పంచదార డబ్బా మూతతీసి భర్తకు చూపించి):

కాం: యిదుగో చూసుకోండి మీ అనుమానం తీరిపోతుంది.

రం: (కాఫీ కొంచం కొంచం త్రాగుతూ) నాకు డబ్బా చూపిస్తేనేగాని, నీమాట నమ్మనని, నామీద నీకు ఎందుకంత అనుమానం చెప్పూ! పంచదార అయిపోయిందని చెబితే చాలదూ! డబ్బా తెచ్చి నా నెత్తిమీద బోర్లించాలా!

కాం: చాల్లెద్దురూ మీ కబుర్లూ, మీరూనూ! చెప్పినమాట కొట్టిపారేస్తే నమ్మినట్టా! నమ్మనట్టా, అనుకోవడం? మీతోటి ఆఁ అంటే అపరాధం, ఊఁ అంటే ఉపరాధం. మధ్యని నేను నలిగి చస్తున్నాను.

రం: సరదాకి అన్నమాట సరదాగా తీసుకోవాలిగాని, దానికి అంత రాద్ధాంత సిద్ధాంతం చెయ్యకూడదు.

కాం: ఆమాట అందరికీ వుండాలి.

రం: లేదని నువ్వెందుకనుకోవాలి? అయితే, రాగా బోగా మధ్యనాళకు పంచదార లేక తప్పదని నిర్ధారణ చేసేవన్నమాట. లేక, మధ్యనాళకుకూడా గట్టెక్కే అవకాశం ఏదైనావుందా? అంటే నా ఉద్దేశం, కోపగించకు, అడుగుతున్నానంతే. దేముడికి నైవేద్యం పెట్టడానికి వేరే డబ్బాతో కొంచెం పంచదార అట్టె పెడతావేమో! మధ్యనాళమట్టుకు దేవుడి దగ్గిర ఒక గరిటెడు పంచదార అప్పు తేవడానికి వీలవదా అని. మళ్ళీ రేపు కొనుక్కోగానే అప్పు తీర్చేద్దాం. అవకాశం వుంటేనే సుమీ. మాటవరసకి అన్నాను.

కాం: దేముడికి రెండునెలలబట్టీ బెల్లం ముక్కే నైవేద్యం పెడుతున్నాను.

రం: ఆ! నిజమే? దేముడికే పంచదార లేకుండా జేసేమూ! (లెంపలు వాయించుకుని) పాపోహం, పాపకర్మాహం! పాపాత్మా, పాపసంభవః పాహిమాం కృపయాదేవ శరణాగత వత్సల" అపరాధం క్షమించు తండ్రీ.

కాంత: మీదొంగ ప్రార్థనలు దేముడికి తెలీకపోవు, దేముడితోటి వేళా కోళా వేమిటి? తిన్నగా ఊరుకోండి.

రంగా: మరి నీతో ఏమైనా అంటే నీకు ఊరంత కోపం వస్తుందాయె. ఏమి చెయ్యడం?

కాంత: సరేగాని కాఫీ ఎలాగవుంది చెబుదురూ?

రంగా: సింప్లీ ఎక్సలెంట్. అంటే చాలా బాగుందన్నమాట. అదేమిటోగాని, నువ్వు ధుమధుమలాడుతూ చేసిన కాఫీ ఘుమఘుమలాడుతూ వుంటుంది. అది నీకోపం తాలూకు ఫ్లేవరు, అయివుంటుంది!

కాంతమ్మ: నాకోపం ఫ్లేవరూ కాదు, మీతాపం ఫ్లేవరూ కాదు, బెల్లంపాటి వారిఅమ్మాయి ఫ్లేవరు.

రంగా: (ఆశ్చర్యంగా) అదేమిటి? చాలా హేమీజింకుగా మాట్లాడుతున్నావే?

కాంతమ్మ: హేమేజింగూలేదు, గీమే మేజింగూలేదు, నిజానికి మొన్నటినుంచీ ఇంట్లో పంచదారవాసనే లేదు. అందరికీ బెల్లం వేసే కాఫీ చేస్తున్నాను.

రంగా: ఆ! ఏమిటీ!

కాంతమ్మ: ఏమిటేమిటి? మీకు కోపం ముక్కునవుంటుంది గదా అని తెలిసే, అలాగ అబద్ధమాడేను.

రంగా: అయితే నాతో పరాసికాల్లోకి దిగేవన్నమాట! మంచీచెడ్డా లేకుండా!

కాంతమ్మ: సరదాకి అన్నమాటలుకి అంతరాద్ధాంతసిద్ధాంతం చెయ్యాలా! అని యిప్పుడేగా, మీరు అడిగేరు? ఆమాట మీ విషయంలో వర్తించదుకబోసు?

రం: (సర్దుకుని, స్తిమితపడి) నువ్వు నిజంగా కాఫీలో పంచదారే వేసివుంటావు నాకు తెలుసులే. లేకపోతే యింత రుచి దానికి ఎక్కడినుంచి వస్తుంది? సరే, ఆవిషయం వదిలిపెట్టేగాని, నిన్నో ప్రశ్న వేస్తాను జాగ్రత్తగా ఆలోచించి, నీ కామన్‌సెన్సు అంతా వినియోగించి సమాధానం చెబుతావూ!

కాం: నా మొఖం! నేను మీకు సమాధానం చెప్పడంఏమిటి? ఎవళ్ళైనా నవ్వి పోతారు.

రం: అలాగనకు. ఈ సమస్య ముఖ్యంగా ఆడవాళ్ళకి బాగా తెలుస్తుంది. చదువుతాను జాగ్రత్తగా విను. (పజిలు కాగితంతీసి చదువుతాడు.) డాష్ (—) ఇది గృహోపకరణములలో మిక్కిలి అవసరమైనది. 1. చెంబు, 2. తప్పేలా. ఈ రెండింటిల్లో ఏది ఎక్కువ రీజన్ బుల్‌గా వుంటుందో బాగా ఆలోచించి చెప్పు.

కాం: రీజనబిల్లి అంటే ఏమిటి?

రం: (చచ్చేం!) అంటే, గృహోపకరణముల్లో చెంబు ఎక్కువ అవసరమైనదా, తప్పేలా ఎక్కువ అవసరమైనదా?

కాం: మంచి ప్రశ్నలాగే వుంది? ఏది ఎక్కువ అవసరం ఏమిటి! రెండూ అవసరమే.

రం: ఓస్సి! ఎంత తేలికగా చెప్పేసేవే! ఈపాటి సంగతి నాకు తెలియకనే, నిన్నడిగే ననుకున్నావేమిటి? ఇంత తేలికగా చెప్పగలిగే జవాబైతే దీనికి వేలకు వేలు బహుమతీ ఎవడిస్తాడు?

కాం: ఎవడు అంత, వేలకు వేలు బహుమానాలివ్వడానికి కూర్చున్నవాడు? వాళ్ళకి డబ్బు పులిసిపోయివుంది కబోసును.

రం: నీదంతా వట్టి అమాయికపు మాలోకం. నిజంగా, నీకు పజిలు సంగతి బోధపరిచినా బోధపడదు.

కాం: అయితే ఆపాటి దానికి నన్నెందుకు అడగడం? ఊరుకున్నదాన్ని ఊరుకోనివ్వక రెచ్చకొడతారు. ఏమైనా అంటే వేళాకోళం చేస్తారు.

రం: ఛాఛా, అదికాదు. నిన్ను వేళాకోళం చెయ్యడానికి అడగలేదు. నాకు అనుమానం కలిగే అడిగేను. చూసేవా? ఇదో పజిలు. దీనిని పూర్తిగా రైటురాసి పంపిస్తే ఎనభైవేల రూపాయిలు ప్రైజు వచ్చిపడుతుంది.

కాం: అమ్మయ్యో! ఎనభైవేలే? చెంబు, తప్పేలా అని రాసినందుకు ఎనభైవేలు రూపాయిలు బహుమానమా? అలాగైతే అందరికీ వచ్చేస్తుంది బహుమానం.

రం: అదే పొరపాటు. ఇది నువ్వు అనుకున్నంత తేలికకాదు కాని, అట్టే అంత కష్టంకూడా కాదు. జాగ్రత్తగా ఆలోచించి వేస్తే, అటుపైని అదృష్టం కలిసివస్తే, ఎనభైవేలు బహుమానం తప్పకుండా వస్తుంది. అయితే, పురుషప్రయత్నం లేందే అదృష్టం ఎలాగకలిసిస్తుంది? ధైర్యే, సాహసే, లక్ష్మీః అన్నారు పెద్దలు. ముందు మనం మన డబ్బు కాదనుకుని కొంత పెట్టుబడి పెడుతూ వుండాలి. కానీ ఖర్చుపెట్టకుండా, వేలకువేలు డబ్బు రావాలంటే ఎలాగొస్తుందనుకున్నావే?

కాం: ఇప్పుడు నేను వేలకువేలు డబ్బురాలేదని బెంగ పెట్టుకు కూర్చున్నానా ఏమిటి?

రం: అదికాదు. డబ్బు వచ్చే అవకాశాలు ఉన్నప్పుడు ఎందుకు పోగొట్టుకోవాలి మనం?

కాం: అయితే మీరేమైనా డబ్బు ఖర్చు పెడుతున్నారా దీనికి?

రం: అదో కబురా? ఖర్చు పెట్టడమే కాదు. వేలసంఖ్యమీద బహుమానం పొంది తీరుతాను ఎప్పటికైనా. మనకి బహుమానం రాగానే, ఏది ఎలాగఉన్నా, ముందు మనం ఒక రేడియో కొనుక్కోవాలి. ఇద్దరం కూర్చుని కమ్మని పాటలు, తాజా వార్తలూ వింటూవుండాలి. ఒకవేళ నేను రేడియో కొంటే, యీ గదిలో ఏమూల పెడితే బాగుంటుందంటావు? దాని కోసం ఒక చక్కని కొత్త టేబిలు చేయిస్తాను. నేను రేడియో కొనేలోపుని అది ఎక్కడవుంచితే బాగుంటుందో ఆలోచించి సిద్ధంగావుండు. మరొక్క సంగతి. మనం రేడియో యిన్‌స్టాల్ చేసినప్పుడు మా స్నేహితులకు చిన్న టీపార్టీ ఏర్పాటు చెయ్యవలిసి వుంటుందేమో కూడాను. వాళ్లు డిన్నరుపార్టీ యిమ్మని కూర్చుంటారో ఏమిటో? సరేలే, అప్పటికొద్దీ ఎలా వీలైతే అలాగ చేసుకోవచ్చు.

కాం: బహుమానాలు యిచ్చేవాడికి అంత డబ్బు ఎక్కడిది?

రం: ఎక్కడి దేమిటి? నాలాంటివాళ్లు లక్షలుకొద్దీమంది పజిల్సుకి డబ్బు కడతారు. ఆ డబ్బంతా కూడబెట్టి బహుమతి వచ్చినవాళ్లకి యిస్తాడు.

కాం: అంతమంది కట్టినప్పుడు ఆ బహుమానం మీకే వస్తుందన్న మాటేమిటి? అందరూ మీలాగే అనుకుంటూ వుంటారు.

రం: అయితేమట్టుకు? అందరికీ పజిలుని నింపే తెలివితేటలూ, కామన్‌సెన్సూ ఉండవద్దా, ఆపైని అదృష్టం కలిసిరావొద్దా!

కాం: అంతా మీలాగే, తెలివైనవాళ్లం అనీ, మనకి అదృష్టం బాగుంటుందనీ, ఆ డబ్బు మనకే తప్పకుండా వస్తుందనీ అనుకుంటూ వుంటారు.

రం: అనుకున్నంత మాత్రానికి ఐపోతా కేమిటి? కష్టపడి ఆలోచించి, కడుతూవుండాలి. కట్టింది పోతోందని అధైర్యపడకూడదు. నేను చూడూ, సంవత్సరంబట్టి కట్టుకొస్తున్నాను. ప్రతీమాటూ, వీసం అంతలో వీగిపోవడంచేత బహుమానం తప్పిపోతోంది. ఎలాగైనా కొద్దికాలంలో వేల బహుమానం రాక తప్పదనుకో.

కాం: ఆ బహుమానం అందరికీ అలాగే కనబడుతూ, ఆశపెడుతూ వుంటుంది. కాని, రావడం మాత్రం ఉండదు.

రం: ఓసి వెర్రిమొఖమా, యిటు చూడే. (పజిలు కాగితం మీదనున్న ఫొటోలూ, పేర్లూ చూపిస్తూ) చూసేవా, ఈ ఆసామీకి నాలాగ రెండు చెవులూ, రెండు కళ్ళూ ఉన్నవాడేనా, యితగాడికి ఏమైనా కొమ్ములు వచ్చేయా! చూడు ఇతనికి యాభై వేలు బహుమానం వచ్చింది. వీడికి వచ్చినప్పుడు నాకుమాత్రం ఎందుకు రాదూ? అని అడుగుతున్నాను.

కాం: బహుమానం పొందిన యీ ఒక్కడినీ చూడకపోతే, పోయినవాళ్లు లక్షల కొద్దీ వుంటారుగదా, వాళ్లని ఎందుకు తల్చుకోరు?

రం: పోయినవాళ్లు మళ్ళీ కట్టుకుంటారు? నే నేం జేస్తున్నాను? అలాగే వాళ్ళూను.

కాం: ఇలాగ ఎన్నిమార్లు కట్టాలి?

రం: ఎన్నిమార్లేనా కట్టవచ్చు. ఎంత డబ్బేనా కట్టవచ్చు.

కాం: బహుమానం రాకపోతే మీరు కట్టిండబ్బు మళ్లీ మీకు యిచ్చేస్తాడా?

రం: ఏం గసుడుసుదానివి బయలుదేరేవే? ఎవళ్ళ డబ్బు వాళ్లకి తిరిగి యిచ్చేస్తే, బహుమానం వచ్చినవాడికి వేలకు వేలు ఎక్కడినుంచి తెచ్చియిస్తాడనుకున్నావ్.

కాం: మీరు యిప్పటికి ఏపాటి డబ్బు కట్టివుంటారు?

రం: ఎంతో ఎక్కడకట్టేను మూడు వందలో నాలుగు వందలో కట్టివుంటాను. అయితేనేంగాక, ఒక్క బహుమానం వచ్చిందిరా అంటే యింతకాలం పెట్టుబడి పెట్టినడబ్బు అంతా ఒక్కమాటే కొట్టుకొస్తుంది,

కాం: మీరు యిలాగ ఖర్చుపెట్టేడబ్బు నాదగ్గిర దాచుకుని వుంటే యీపాటికి మూడు నాలుగువందలు నిలవ వుండేదిగదా?

రం: మనదగ్గిరుంటే ఖర్చే అయిపోయేది. ఒకవేళ ఆడబ్బే నీదగ్గిర దాచేననుకో. ఆ మూడు నాలుగువందలూ అలాగే వుండిపోతాయికాని, అవి వుండి లాభమేమిటి? ఈ పజిల్సుకి కట్టేనా? మనకు బహుమతి రాలేక పోబట్టికాని, ఒకవేళ వచ్చేవుంటే యీపాటికి మనవద్ద వేలసంఖ్యలో డబ్బు ఉండిఉండేదేనా?

(చాకలి ప్రవేశం. వీధిలో నిలబడి అరుస్తాడు)

చా: అయ్యగారండీ!

రం: (కాంతమ్మతో చేత్తో సంజ్ఞ చేస్తాడు ఎవరు అన్నట్లుగా)

కాం: చాకలివాడులాగుంది. వాడికి మూడురేవులు నిండిపోగా, పైని మళ్ళీ రెండురేవులైంది. జీతంకోసం రాజావచ్చి నన్ను పీకేస్తున్నాడు.

రం: మెల్లిగా మాట్లాడమంటే! కిటికీ దగ్గిర నిలబడి, నేను యింట్లో లేనని చెప్పు.

కాం: అది నావల్లగాదు సుమండీ. ఆమాట ఏదో మీరే చెప్పరాదూ.

రం: ఆ మాట నే నెలాగ చెబుతాను?

కాం: నేనుమాత్రం ఎలాగ చెబుతాను?

చాకలి: (బయటనుండి) బాబుగారండీ.

రం: (భార్యావైపు చూస్తూ) మెల్లిగా. ఏం చేతగాదు శుద్ధ బుద్ధావతారం. (వీధి తలుపుతీసి) ఏంరా?

చా: జీతం కోసం బాబూ, రోజూ తిరగలేక చస్తున్నాను.

రం: రేపు యింకా ఫస్టుతారీకు గదా, యీవాళ అప్పుడే డబ్బు ఎక్కడినుండి వస్తుందనుకున్నావురా? రేపో ఎల్లుండో కనబడు.

చా: కిందటినెల జీతంకూడా యివ్వనేరు బాబు.

రం: మరి యిప్పుడు నీకు యివ్వవలసింది అదేగా? తరవాత మళ్ళీ యింకా మూడో రేపు అవందే జీతం ఎలాగొస్తుంది? మూడో రేపు కూడా అవనీ, రెండు నెలల జీతం ఒక్కమారే పట్టుకుపోవచ్చును.

చా: బొగ్గులు కొనుక్కోవాలి. అందాకా ఒక రూపాయేనా వుంటే దయిచేయించండి బాబూ.

రం: వుంటే దాచుకుంటానురా, నీ వెర్రిగాని. నెలాఖరు సమయం. చేతిలో కానీకూడా వుండదు తెలుసా. మరి యింక నువ్వువెళ్లు.

[చాకలి గొణుక్కుంటూ వెళ్ళిపోతాడు.]

కాం: మీదగ్గిర ఏం మాటాడకుండా వెళ్లిపోయేడా? ఆనక మళ్లీ వచ్చి ఊరంత అల్లరిచేస్తాడు.

రం: సమాధానం చెప్పిపంపించే తెలివితేటలు ఆడవాళ్లకి లేకపోతే మరేం జేస్తారు? వాళ్లమీద చెర్రు బుస్సుమంటే వూరుకుంటారనుకున్నావేమిటి?

కాం: నెల అవగానే వాడి డబ్బు వాడికి పారేస్తే, వాడి దగ్గిర అంత బాబూ నాయినా అని బతిమాలడం ఎందుకొస్తుంది?

రం: ఓహో! ఏం దర్జా! నువ్వు నిజంగా ఏ జమీందారు గారో పెళ్ళాండి ఉండవలిసింది.

కాం: మీరూ జమీందారుగారు కావడానికి సిద్ధంగానే వున్నారుగా! ఇంక నాకు లోటేమిటి?

రం: సరేగాని, చూడూ, నువ్వు యీవాళ నాకో చిన్న సాయం చేసిపెట్టాలి.

కాం: నేనంటే మీకు మరీ వేళాకోళం ఎక్కువైపోన్నాదండీ.

రం: నీమీద కాకపోతే, మరెవరిమీద వేళాకోళం ఎక్కువౌతుంది? సరేగాని, యిలా చూడు, నీకు ఎల్లుండి జీతం అందగానే యిచ్చేస్తాను. ఒక్క ఐదురూపాయిలువుంటే సర్దుబాటు చేద్దూ.

కాం: బాగానేవుంది వరస. నాదగ్గిర ఐదురూపాయిలు వుంటే యింక కావలిసిందేమిటి? చేతులో అణాడబ్బులు పెట్టిన పాపాన్ని పోరుగాని, మీకు ఐదు రూపాయిలు నేను బదులివ్వాలి. చాలా బాసుంది లెండి.

రం: పోనీ ఐతే పొరుగింటి మీస్నేహితురాలిని అడిగి చూద్దూ, ఎంతైనా పుణ్యం వుంటుండి. ఎల్లుండి మళ్ళీ యిచ్చేదాం.

కాం: ఇంక అదొక్కటే తక్కువొచ్చింది నా బతుక్కి. వూళ్ళోకి మప్పికికూడా బయలుదేరమంటున్నారు. చాలు చాలు ఊరుకోండి యీపాటికి. ఎవరైనా వింటే నవ్విపోతారు.

రం: ఓస్సి! ఇంతలోకే, నవ్విపోవడం? ఏం అంత తప్పు పనిచేసేమని? ఆపాటి అవసరానికి పనికిరాకపోతే మని యిరుగూ పొరుగూ అనుకోవడం ఎందుకూ?

కాం: ఇందుకే నేమిటి? ఇరుగూపొరుగూ వాళ్ళకి మీరు ఏపాటి సాయం చేస్తున్నారు చెబుదురూ?

రం: పోనీలేగాని, నీకు పుణ్యం వుంటుంది. గట్టిగా కేకలు వెయ్యకు ఊరుకో, నేరక పోయి అడిగేను.

కాం: ఎందుకంత? అప్పుజేసైనా పజిలుకి కట్టకపోతే నేమండి?

రం: నీఘాటి బుద్ధిలేక. నాదగ్గిర పాతికరూపాయిలు వున్నాయి. పరధ్యాన్నంగా పజిలు నింపితే ఎక్కువగళ్ళు నిండిపోయేయి. మరో ఐదు రూపాయిలు వుంటేనేగాని యీపజిలు పంపించటానికి వీల్లేదు:

కాం: మీదగ్గిర పాతిక రూపాయిలు పెట్టుకున్నే యిన్ని వేషాలు పడుతున్నారూ?

రం: ఈపజిలు కట్టడానికి యీవాళే అఖరు రోజు.

కాం: ఈవాళ యీపజిలు కట్టకపోతే యిప్పుడేం కొంప మునిగిపోయిందండీ. ఇదివరకెన్నో మార్లు కడితేరానిది, యీమారు ఆబహుమానంవచ్చి వొళ్ళోపడిపోతుందని ఏమిటి నిశ్చయం!

రం: నువ్వు శకునపక్షివని మొదటే చెప్పేనుగా! నేను అసలు యీసంగతి నీతో చెప్పడమే పొరపాటు. సాగదీసి సాగదీసి అడుగుతున్నావు. రేపు ప్రొద్దుట ఏదైనా బహుమానంవస్తే, యీ కబుర్లన్నీ మాయమైపోతాయి. నాకు వడ్డాణం చేయించండి అంటే, చంద్రహారాలు చేయించండీ అంటూ కౌగలించుకుంటావు. ఆడవాళ్ళ స్వభావం అంతట్లోవుందన్న మాట. అందుకే - షేక్స్పియర్, 'ఫ్రెయిల్టీ! దై నేం ఈజ్ వుమన్. (*Frailiy! thy mame is womau!*) అన్నాడు. ఎంత అనుభవంమీద చెప్పేడో మహానుభావుడు!

కాం: ఎప్పుడో రాబోతుందన్న డబ్బుతో నాకు వడ్డాణాలూ చంద్రహారాలూ చేయించడంకోసం ప్రస్తుతం కుర్రవెధవకి లాగుగుడ్డ ఐనా కుట్టించకుండా, పిల్లకి బడికి జీతమైనా కట్టకుండా, పైపెచ్చు నన్ను ఊళ్ళోకి అప్పుకి బయలుదేరమంటున్నారు. మీలాంటి ఆయనే, ఒకాయన, ఊళ్ళో పెళ్ళి వారు భోజనానికి పిలవకపోతారా అని, సాయంత్రిందాకా, పొయిలో నిప్పువెయ్యనిచ్చేడు కాదుట. పిల్లలు ఆకలితో ఏడుస్తూవుంటే, పెళ్ళివారింటికి వెళ్ళి బూరెలు తిందాంరా అని ఓదార్చేడుట. అలావుంది మీసంగతి.

(టెలెగ్రాం మెసెంజరు ప్రవేశం)

మెసెంజరు (వీధులోంచి) రంగారావు పంతులుగారికి టెలిగ్రాం అండీ!

(రంగారావు వీధి గుమ్మంలోకి వెళ్ళి, సంతకంచేసి టెలెగ్రాం పుచ్చుకుంటాడు. టెలెగ్రాం మాట వినగానే, కాంతమ్మ గుండెల్లో రాయిపడినట్టుగా, ఆవిడ మొఖంలో ఆందోళన స్పష్టమౌతూవుంటుంది. ఆవిడ కూడా రంగారావు వెనుక నిలబడి)

కాం : ఎక్కడినుంచండీ టెలిగ్రాం ?

(రంగారావు మొఘంలో ఎక్కడా విచారం కలిపించదు. సంతోషంగా వికసించివుంటుంది. టెలిగ్రాం కవరుచింపకుండా లోపలికి పట్టుకువచ్చి కుర్చీలో కూర్చొంటారు. కాంతమ్మకూడా అతనితోటే లోపలికివచ్చి, ఆతని ప్రక్క నిలబడి గాభరాగా చూస్తూవుంటుంది.)

కాం : ఎక్కడినుంచండీ! టెలిగ్రాం! వేగం చదివి చూడండీ!

రం : మరేం కంగారుపడకు. టెలిగ్రాం అనీ సరికల్లాకం గారుపడే కాలంపోయింది. ఇందులో మరేమీ విచారకరమైన వార్త వుండదు. భియపడకు.

కాం : ఏమో! నాకు భయంగా వుంది. వేగిరం చదివి చూడండి.

రం : నేను ఒక్క విషయం చెబుతానువిను. మంచి కబురేనా సరే, చెడ్డకబురైరా సరే, అకస్మాత్తుగా వింటే ఒక్కొక్కప్పుడు ప్రమాదిస్తుంది. అందుచేత గాభరాపడకు. నేను అసలు మూడు రోజులబట్టి యీ టెలిగ్రాం కోసమే ఎదురుచూస్తున్నాను. ఇప్పుడింకా పోస్టాఫీసుకు వెళ్ళి కనుక్కుందామా అనుకుంటున్నాను.

కాం : మీమాటలు నాకేం అర్థం కావటంలేదు. వేగం చదివి చూద్దురూ!

రం : గాభర్రాపడవద్దని చెప్పేనా? ఇందులో సంతోషకరమైనవార్తనే నువ్వు వినబోతున్నావు. నేను క్రిందటి మారు కట్టిన పజిలు తాలూకు ఫలితాలు ప్రకటించే సమయం యిది. పజిలులో ఫస్టుప్రైజ్ వచ్చినవాళ్ళకి టెలిగ్రాంద్వారా తెలియపరుస్తారు. నువ్వు ఎక్కువ సంతోషం మాత్రం పడిపోకు. మనకు ప్రైజ్ వచ్చివుంటుంది. మొదటి బహుమానం. అంటే వేలసంఖ్యలో వుంటుంది. అంటే—మెల్లిగా వినుసుమీ—గుండెలు చేత్తో పట్టుకుని ధైర్యంగా విను—ఎనభై వేలు బహుమానం వచ్చివుంటుంది.

కాం : ముందు చదివి చూద్దురూ, పిచ్చి మాటలాడక.

రం : నావా, నీవా, పిచ్చిమాటలు? ఈపర్యాయం యీ బహుమానం నాకు రాక తప్పదని నేను అనుకుంటూనే వున్నాను. (అంటూ కవరు చింపి టెలెగ్రాం కాగితం పైకితీస్తాడు. కాంతమ్మ భయంగా చూస్తూవుంటుంది. రంగారావు చదువుతాడు. చేతులు వొణుకుతాయి. కాగితం క్రిందపడిపోతుంది. రంగారావు మొఘం వెలవెలపోతుంది. అతడు కుర్చీలో వెనక్కి కూలబడిపోతాడు!)

కాం: (గాభరాగా, ఆతని మొఘం దగ్గిర మొఘం పెట్టి) ఏమిటండీ! ఏమిటండీ! చెప్పండీ! చెప్పండీ!!

రం : (ఏడుపు మొఘంపెట్టి) మానాన్నకి జబ్బుగావుందిట! వెంటనే బయలుదేరి రమ్మని మాఅన్నయ్య వైరిచ్చేడు!!

---

34 సంవత్సరముల
అనుభవముగల
రెడ్డి అండ్ కో
(రిజిష్టర్డ్)
సర్వమేహ చర్మరోగ నిపుణులు
&
కుష్టు, బొల్లికి గ్యారంటీ చికిత్స
కేటలాగు ఉచితము
రెడ్డి అండ్ కో.,
గోపాలపురం
తూర్పు గోదావరి జిల్లా, (వయా) తణుకు.

పిల్లల సాహిత్యం

పిల్లల బొమ్మల రామాయణం	1-8-0
పిల్లల బొమ్మల భాగవతం	1-8-0
పిల్లల బొమ్మల భారతం	1-8-0
బొమ్మరిల్లు (ఆటలు-పాటలు)	0-8-0
పిల్లల పాటలు	1-0-0
పిల్లల కథలు	1-0-0
పిల్లల హాస్యకథలు	1-0-0
పిట్ట కథలు	4-0-0

★
దొరకుచోటు:
కాళహస్తి తమ్మారావు & సన్సు,
సంస్కృతాంధ్ర బుక్ డిపో,
రాజమండ్రి.